**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**
**Telangana State Committee**
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com

తేది: 11.07.2021

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలను నింపాలి

రోజురోజుకు నిరుద్యోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేసి, కాలపరిమితిలో మొత్తం ఉద్యోగాలను భర్తీ చేయాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

ఎంపీగా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాల భర్తీపై స్పందించకుండా రాష్ట్రానికే పరిమితమై బాధ్యతరహితంగా మాట్లాడడం విడ్డూరం. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో 22 శాతం అంటే, సుమారు 8 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లోని వ్యయశాఖ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరించి, అందులోని ఉద్యోగులను తొలగించి, భవిష్యత్‌లో ప్రభుత్వరంగం లేకుండా, కొత్త ఉద్యోగాలు రాకుండా, రిజర్వేషన్లు లేకుండా చేయాలని చూస్తున్నది. దీంతో దళిత, గిరిజనులకు ఉద్యోగ అవాకశాలు పోతాయి. ఇవేవీ పట్టని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు దొంగే – దొంగ దొంగ అన్న చందంగా ఇస్తున్న ప్రకటనలు ప్రక్కనపెట్టి కేంద్రస్థాయిలో ఉద్యోగాల గురించి మాట్లాడితే మంచిదని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

రాష్ట్రంలో నీళ్ళు, నిధులు, నియామకాల నినాదంతో టీఆర్ఎస్ అధికారంలోకొచ్చింది. రాష్ట్రంలో రెండు లక్షలకుపైగా ఉద్యోగ ఖాళీలు భర్తీచేస్తామని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామి ఇచ్చి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. అనుకున్న స్థాయిలో ఉద్యోగాలు నింపకపోవడంతో నిరుద్యోగులు ఉద్యమబాట పట్టాల్సిన పరిస్థితి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉద్యోగాలను భర్తీచేసి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

## తొలగించిన నర్సులను విధుల్లోకి తీసుకోవాలి

కోవిడ్ తరుణంలో అవసరాల నిమిత్తం 1640 మంది కాంట్రాక్ట్ నర్సులను 118 జీవో ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీరు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, సంవత్సరానికి పైగా కోవిడ్ పేషెంట్స్ కోసం రిస్కుతో కూడిన డ్యూటీలు చేస్తూ రోగుల ప్రాణాలు కాపాడారు. నర్సుల సేవలను గుర్తించి వారికి జీతభత్యాలు పెంచి, వారిని ఉద్యోగాల్లో కొనసాగించాల్సిన ప్రభుత్వం, ఆ పని చేయకుండా వారి ఉద్యోగాలనే తొలగించి ఆ కుటుంబాలను రోడ్డున పడేసింది. నిరసన తెలుపుతున్న నర్సులను అక్రమంగా ఆరెస్టులు చేయించి పోలీస్ స్టేషన్లల్లో నిర్బంధిస్తున్నది. ఇప్పటికే ప్రభుత్వ వైద్యరంగంలో అనేక లోపాలతో పాటు, సిబ్బంది, డాక్టర్లు, నర్సుల కొరత తీవ్రంగా ఉన్నది. రాష్ట్రంలో ఇంకా కరోనా తగ్గలేదు. త్వరలోనే మూడవ దశ ఉన్నట్లు హెచ్చరికలు వస్తున్నాయి. కరోనాను ఎదుర్కోవడానికి సిద్దంగా ఉండాలని, అందుకవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని స్వయంగా వైద్యశాఖను చూస్తున్న ముఖ్యమంత్రిగారే యంత్రాంగాన్ని ఆదేశించి, మరోప్రక్క నర్సులను తొలగించడం ప్రభుత్వ అనాలోచిత చర్య. ఈ పరిస్థితుల్లో నర్సులను తొలగిస్తే వైద్యరంగం మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తొలగించిన నర్సులను తక్షణమే విధుల్లోకి తీసుకుని, వారికి ఉద్యోగ భద్రత కల్పించి, వారి సేవలను ఉపయోగించుకోవాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నది.

**(తమ్మినేని వీరభద్రం)**
**రాష్ట్ర కార్యదర్శి**